నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శనివారం 24 మే 2025 | SIDDIPET

రేవంత్‌రెడ్డి నోరువిప్పితే అబద్ధాలు

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విఠలాపూర్‌లో పెద్దమ్మ కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

- కేసీఆర్ కట్టిచ్చిన కాళేశ్వరంతోనే రెండు పంటలు పండుతున్నాయి
- కాళేశ్వరం కూలింది అనే వారు విఠలాపూర్‌కి వచ్చి చూడండి
- అనంతమ్మ చెరువు ఎట్లా మత్తడి దుంకుతున్నది
- యాసంగి పంట ఎట్లా పండింది
- పెద్దమ్మ తల్లి దయ...కేసీఆర్ దీవెనతో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నాం
- కేసీఆర్ హయాంలో కరెంట్ బాధలు,తాగునీటి గోసలు తీరాయి
- ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విఠలాపూర్‌లో పెద్దమ్మ ఉత్సవాలకు హాజరైన మాజీ మంత్రి

చిన్నకోడూరు, మే 23: ''మీ గ్రామం మీద ప్రేమతో పెద్దమ్మ పండుగకు ప్రతి సంవత్సరం మీరు పిలవగానే వస్తా.. పదేండ్ల కింద విఠలాపూర్ మారుమూల పల్లె... తాగు నీటి గోస.. చుక్క నీళ్లు లేక పాయే అలాంటి పల్లెకు తిప్పలు తప్పి అభివృద్ధి చేసుకున్నాం'' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విఠలాపూర్‌లో జరుగుతున్న పెద్దమ్మ ఉత్సవాలకు శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రేవంత్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతున్నాడని మండిపడ్డాడు. కాళేశ్వరం ఉత్తది అయితే విఠలాపూర్ గ్రామంలోని చెరువు, కాల్వల్లో నీళ్లు ఎట్లా దుంకుతున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలింది అనే వారు విఠలాపూర్ గ్రామానికి వచ్చి చూడాలని సూచించారు. కాళేశ్వరంలో నీళ్లు లేనిది ఎండాకాలం విఠలాపూర్ అనంతమ్మ చెరువు ఎట్లా మత్తడి దుంకుతుందన్నారు. పెద్దమ్మ తల్లి దయ, కేసీఆర్ దీవెనతో కాళేశ్వరం ప్రాజెక్టుతో నీళ్ల బాధలు తప్పాయన్నారు.. కాల్వలు, చెరువుల్లో జల కళ వచ్చిందన్నారు. కొంతమంది కాళేశ్వరం కూలింది అని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో కరెంట్ బాధలు, తాగు నీటి గోస తీరిందన్నారు. రోడ్లు మంచిగా చేసుకున్నామని, గంగపూర్, విఠలాపూర్‌కు డబుల్ రోడ్డు వేసుకుంటున్నట్లు గుర్తుచేశారు. మహిళలకు ఇస్తామన్న రూ. 2500, రూ. 4000 వేల పింఛన్, కేసీఆర్ కిట్ రేవంత్‌రెడ్డి ఏగొట్టాడన్నారు. పెద్దమ్మ తల్లి దయతో అందరినీ చల్లగా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, మాజీ సర్పంచ్ నవీన్, మాజీ ఎంపీటీసీ, ముదిరాజ్ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విఠలాపూర్‌లో డప్పుచప్పుళ్లతో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

చంద్రబాబు కోసం మేడిగడ్డను మాయం చేసేకుట్ర

విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

- కక్షసాధింపులో భాగంగానే కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 23: ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణగా సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డను మాయం చేసే కుట్ర చేస్తున్నారని, నరేంద్రమోదీ, రేవంత్‌రెడ్డి, చంద్రబాబులు ఒక్కటై ఆకుపచ్చ తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కుట్ర జరుగుతున్నదని దానిలో భాగంగానే కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు పంపారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌ను వేధించేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రంలోని నరేంద్రమోదీతో జతకలిసి కాళేశ్వరంపై నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షసాధింపు చర్యలే అని, చంద్రబాబు హయాంలో నిర్మించిన పోలవరం ప్రాజెక్టులో ప్రమాదం జరిగి ఏడేండ్లు గడిచినా విచారణ చేయకుండా నరేంద్రమోదీ ప్రభుత్వం అప్పటి సీఎం చంద్రబాబుకు నోటీసులు పంపకుండా వత్తాసు పలికిందన్నారు. ఇప్పుడు ప్రమాదం జరిగిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ.1000 కోట్లు మంజూరు చేసిందన్నారు. తెలంగాణలో కుంగిన ఫిల్లర్లకు రూపాయి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. పార్లమెంట్‌లో కాళేశ్వరం, పోలవరం ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ ఎంపీలు ఎన్నిసార్లు అడిగి, ధర్నాలు చేసినా కేవలం పోలవరానికి మాత్రమే జాతీయహోదా ఇచ్చి కాళేశ్వరానికి మొండిచేయి చూపడం దారుణమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని నీటి దోపిడీని అరికట్టడానికి రీడిజైన్ చేసి స్వల్పకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 450టీఎంసీలకు పైగా నీటిని వినియోగించుకునే విధంగా కేసీఆర్ ప్రాజెక్టును నిర్మించడంతో కోటి ఎకరాల మాగాణితో తెలంగాణ దేశానికి అన్నంపెట్టే అన్నపూర్ణగా మారిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో తలత్తిన చిన్నపాటి సాంకేతిక లోపాన్ని సాకుగా చూపుతూ ఫిల్లర్లను రిపేర్ చేయకుండా కాళేశ్వరం జలాలను తెలంగాణకు దక్కకుండా కుట్రలను చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాళేశ్వరం గొప్పతనాన్ని సుప్రీంకోర్టు తెలిపినా ఇక్కడ ఉన్న అసమర్థ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అర్థం కావడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికి తలమానికమని, రాష్ట్రానికి ఆత్మగౌరవ ప్రతీక అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టి మరల్చడానికి, కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయడానికి అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.94వేలకోట్లు ఖర్చు అయితే లక్షకోట్లు స్కాం అంటూ మాట్లాడడం దారుణమన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా కేసీఆర్, హరీశ్‌రావును ఏమీచేయలేరన్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు మెట్టయ్య, దుర్గాప్రసాద్, నాయకులు మల్లేశం, అహ్మద్ పాల్గొన్నారు.

కన్నీళ్లు పెట్టిస్తున్న కాంగ్రెస్ సర్కారు

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక,మే 23: కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు కష్టాలు, కన్నీళ్లే దిక్కయ్యాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రాల ప్రారంభోత్సవాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చూపిన ఆసక్తి ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్, చేర్వాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మెడలు వంచైనా ధాన్యం కొనుగోలు చేయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలతో మంత్రులు, కాంగ్రెస్ నాయకులు హడావుడి చేయడం తప్పా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో మహంకాళి విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి, భూంరెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

బసవేశ్వరుడి స్ఫూర్తితో అభివృద్ధి

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లిబైపాస్‌రోడ్డులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి

జహీరాబాద్/ కోహీర్/ ఝరాసంగం 23 : విశ్వగురు బసవేశ్వరుడి స్ఫూర్తితో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి బైపాస్ సెంటర్‌లో రూ.60లక్షలతో నిర్మించిన బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బసవేశ్వరుడి సందేశాలతో రాహుల్‌గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడా యాత్ర చేశాడన్నారు. బసవేశ్వరుడు అందించిన సూచనలు, స్ఫూర్తి, సందేశాలతో అభివృద్ధి పథంలో నడిపేందుకు ముందుకు సాగుతామన్నారు. కాంగ్రెస్ సామాజిక న్యాయం చేసేందుకు కులగణన చేపట్టిందని వివరించారు. ఆనాడే చట్టసభల్లో ప్రజానిర్ణయాలకు భాగస్వామ్యం కల్పించాడన్నారు. వారి సందేశంతోనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు.

సీఎం చేతులమీదుగా అభివృద్ధి పనులు ప్రారంభం

జహీరాబాద్ పర్యటనలో భాగంగా హుగ్గెల్లిలో విశ్వగురు బసవేశ్వరుడి విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఝరాసంగం మండలంలోని పలు గ్రామాల వరకు తొమ్మిది కిలో మీటర్ల మేరకు రూ.173కోట్లతో నిర్మించిన నాలుగు లైన్ల నిమ్జ్ రోడ్డు, మాచ్నూర్‌లో రూ.26కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలి వద్ద శిలాఫలకాలతో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. జహీరాబాద్–బీదర్ రోడ్డుపై రూ.90కోట్లతో నిర్మించిన రైల్వే బ్రిడ్జిని ప్రారంభించారు. జహీరాబాద్ మున్సిపాలిటీ ప్రజల దాహార్తి తీర్చేందుకు అమృత్ పథకం కింద రూ.66కోట్లతో నీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. రూ.97.07 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లను పునరుద్ధరించనున్నారు. చిరాగ్‌పల్లి–మన్నాపూర్ మధ్య తొమ్మిది కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డును అనుసంధానం చేయనున్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్, బొంతపల్లి, మాంబాపూర్, ఖాజీపల్లి ప్రాంతాల్లో హరిత నిధి ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు రూ.9.60కోట్లతో ఆ పథకాన్ని 2,485 హెక్టార్లలో అమలు చేయనున్నారు. మొగుడంపల్లి, గుమ్మడిదలతో రూ.6.20కోట్లతో నిర్మించిన కస్తుర్బాగాంధీ బాలికా విద్యాలయ భవనాలను ప్రారంభించారు. కవేలి జాతీయ రహదారి పక్కన రూ. 1.99కోట్లతో నిర్మించే పెట్రోల్ బంకుకు శంకుస్థాపన చేశారు. నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 454మందికి రూ.72.11కోట్లను చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సంజీవరెడ్డి, మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు.



జహీరాబాద్ సమీపంలోని పస్తపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఇంటిదారి పట్టిన జనం

సీఎం మాట్లాడుతుంటే ఇంటిదారి పట్టిన జనం

జహీరాబాద్ /కోహీర్/ఝరాసంగం, మే 23 : జహీరాబాద్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పస్తపూర్‌లో శుక్రవారం నిర్వహించిన సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. సభలో ముందుగా ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ మంత్రి చంద్రశేఖర్, మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ మాట్లాడిన మాటలను జనం శ్రద్ధగా విన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం ప్రారంభించగానే జనం ఇంటి దారి పట్టడం ప్రారంభించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని ఓ వైపు సీఎం చెబుతున్నా వాటిని పట్టించుకోలేదు. సీఎం ప్రసంగం కూడా ప్రజలకు అర్థం కాలేదు. అప్పటికే సగం కుర్చీలు ఖాళీ అయ్యాయి. ఉదయం 11గంటలకు సభ ఉందని జనాన్ని అక్కడికి తరలించారు. కానీ సభ చాలా ఆలస్యంగా మొదలైంది. మధ్యాహ్నం 1:30కి సభ ప్రారంభం కావడం, సీఎం 2:30కి మాట్లాడటం, ఆకలి కోసం జనం ఇబ్బంది పడ్డారు. జనం అక్కడి నుంచి వెళ్తుంటే పోలీసులకు కూడా ఏంజరుగుతుందో అర్థం కాలేదు.

మామిడ్గిలో ఉద్రిక్త పరిస్థితులు

- నిమ్జ్ భూ బాధితుల ముందస్తు అరెస్టు
- బలవంతంగా భూ సేకరణ ఆపివేయాలి
- ప్రాజెక్టుకు సారవంతమైన భూములు అసలే ఇవ్వం: భూ బాధితులు

సంగారెడ్డి జిల్లాలోని నిమ్జ్ భూ బాధితులను అరెస్టు చేసి హద్నూర్ పీఎస్‌కు తీసుకువచ్చిన పోలీసులు

జహీరాబాద్, మే 23 : నిమ్జ్ భూబాధితుల ముందస్తు అరెస్టులతో సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్ పర్యటన సందర్భంగా జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, హద్నూర్ ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెల్లవారు జామున మామిడ్గి గ్రామానికి సిబ్బందితో చేరుకున్నారు. నిమ్జ్ భూబాధితులను సీఎంతో కలిసి సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం కల్పిస్తామని పోలీసులు తెలిపారు. నాలుగైదుగురు మాత్రమే రావాల్సి ఉంటుందని పోలీసులు చెప్పగా మేమందరం కూడా వస్తామని మహిళలు అనడంతో సెక్యూరిటీ వల్ల మీరందరూ కలిసేందుకు అవకాశం ఉండదన్నారు. గ్రామానికి చెందిన నిమ్జ్ భూబాధితులు రాజిరెడ్డి, నాగన్న, సంజీవ్‌రెడ్డి తదితరులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తుండగా మహిళలు, గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, నిమ్జ్ భూబాధితులకు మధ్య ఉద్రికత పరిస్థితులు నెలకొన్నాయి. అరెస్టు పేరుతో సీఎం తో కలిసి మాట్లాడిస్తామని నమ్మబలికి సభకు వెళ్లకుండా ముందు జాగ్రత్త చర్యగా నిమ్జ్ భూబాధితులను అరెస్టు చేసి హద్నూర్ పోలీసు స్టేషన్‌కు తరస్తుండగా మహిళలు అడ్డుకుని ఆందోళనకు దిగారు. ప్రభుత్వం, పోలీసుల వైఖరిని ఎండగడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిమ్జ్ బాధితులు మాట్లాడుతూ సారవంతమైన భూములను నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని వాపోయారు. పట్టాభూమికి మార్కెట్‌లో ఎకరానికి రూ. 40 నుంచి 80 లక్షల వరకు ధర పలికితే కేవలం రూ. 15 లక్షలు చెల్లించి తమకు తీరని అన్యాయం చేయడం సరికాదన్నారు. భూములు తీసుకునేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే భూమికి బదులు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు, గ్రామస్తుల ఆందోళన మధ్యనే నిమ్జ్ భూబాధితులను అరెస్టు చేసి హద్నూర్ పీఎస్‌కు తరలించారు. నిమ్జ్ భూబాధితులను అరెస్టు చేయడం పట్ల వివిధ పార్టీల నాయకులు ఖండించారు.

నిమ్జ్ భూ బాధితులకు న్యాయం చేయాలి

నిమ్జ్ ప్రాజెక్టు కోసం బాధిత రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని, దౌర్జన్య భూసేకరణ, అక్రమ అరెస్టులు ఆపాలని నిమ్జ్ భూబాధితులు శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. 2013 భూ సేకరణ చట్టానికి వ్యతిరేకంగా భూమి సేకరిస్తున్నారని, పట్టా, ప్రభుత్వ భూములకు ఎకరానికి రూ. 15 లక్షలు చెల్లించడంతో అన్యాయం జరుగుతుందని వాపోయారు.

మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న నిమ్జ్ భూబాధితులు

సారవంతమైన భూములు అసలే ఇవ్వం

సారవంతమైన భూములను నిమ్జ్ ప్రాజెక్టుకు అసలే ఇవ్వం. రెండు, మూడు పంటలు పండిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. పట్టా భూమికి మార్కెట్‌లో ఎకరానికి రూ. 40 నుంచి 80లక్షల వరకు ధర ఉంది. నిమ్జ్ ప్రాజెక్టులో ప్రభుత్వ, పట్టాభూమికి ఎకరానికి కేవలం రూ. 15 లక్షలు ఇవ్వడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రాణాలు పోయినా సరే సారవంతమైన భూములను నిమ్జ్ ప్రాజెక్టుకు ఇవ్వం. భూమికి బదులుగా భూమి ఇస్తే భూములు ఇస్తాం. తమ సమస్యలు పరిష్కరించే వరకూ ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటాం.

– రాజిరెడ్డి, నిమ్జ్ భూబాధితుడు, మామిడ్గి గ్రామం, న్యాల్‌కల్ మండలం, సంగారెడ్డి జిల్లా

పెద్దశంకరంపేటలో ఏసీబీ దాడులు

- రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇన్‌చార్జి ఎంపీడీవో
- కోర్టులో హాజరుపర్చనున్న అధికారులు
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సుదర్శన్

ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఇన్‌చార్జి ఎంపీడీవో విఠల్‌రెడ్డి

పెద్దశంకరంపేట,మే23: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలానికి చెందిన ఇన్‌చార్జి ఎంపీడీవో విఠల్‌రెడ్డి డ్రైనేజీ పనుల విషయంలో రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా మెదక్ జిల్లా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దశంకరంపేట మేజర్ గ్రామపంచాయతీకి చెందిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన డ్రైనేజీ పనులకు సంబంధించి మొత్తం రూ.2.92 లక్షల పనులు ఉండగా అందులో రూ.1,95 లక్షల పనులు పూర్తి కావడంతో అప్పుడు ఎంపీవోగా విధులు నిర్వహించిన విఠల్‌రెడ్డి ఎంబీ చెక్కు ఇవ్వడానికి రూ.20 వేలు డిమాండ్ చేశారన్నారు. ప్రస్తుతం అతను పెద్దశంకరంపేట ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఎంబీకి సంబంధించి లంచం అడగడంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులకు ఈనెల 20వ తేదీన ఫిర్యాదు చేశారన్నారు. శుక్రవారం సాయంత్రం పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో రూ.15 వేల నగదు ఇన్‌చార్జి ఎంపీడీవో విఠల్‌రెడ్డికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. రూ.15వేల నగదు స్వాధీనం చేసుకొని అవినీతికి పాల్పడిన అధికారిని నాంపల్లి కోర్టులో ప్రవేశపర్చనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

బీఆర్ఎస్ జహీరాబాద్ నాయకులను అరెస్టు చేసి పట్టణ పీఎస్‌కు తరలించిన పోలీసులు

జహీరాబాద్, మే 23 : సీఎం రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పర్యటన నేపథ్యంలో జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల్లోని బీఆర్ఎస్ , సీపీఎం నాయకులను అరెస్టు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున జహీరాబాద్ పట్టణంతో పాటు మల్లి, డప్పూర్, న్యామతాబాద్ గ్రామాల్లోని బీఆర్ఎస్, సీపీఎం నాయకుల ఇండ్ల వద్దకు జహీరాబాద్ ఎస్సై కాశీనాథ్, హద్నూర్ ఎస్సై రాజశేఖర్ సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. బీఆర్ఎస్ జహీరాబాద్ పట్టణ నాయకులను చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించగా, న్యాల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతారనే ఉద్దేశంతో అరెస్టు చేశారని, ప్రశ్నించే గొంతు కలను ఆపలేరని బీఆర్ఎస్ నాయకులు నామరవి కిరణ్, యాకుబ్, బండి మోహన్, న్యాల్‌కల్ మం డల నాయకులు మారుతీయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, శివరాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీ. రామచందర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నిక ల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకూ ప్రభు త్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

సంగారెడ్డి జిల్లాలోని బీఆర్ఎస్ న్యాల్‌కల్ మండల నాయకులను అరెస్టు చేసి హద్నూర్ పీఎస్‌కు తరలించిన పోలీసులు

రహదారి పనులు వేగవంతం చేయాలి

బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్‌టౌన్, మే 23: పట్టణంలో రహదారి పనులు వేగవంతం చేయాలని, లేనిపక్షంలో సదరు కాంట్రాక్టర్‌పై నిబంధనల ప్రకారం క్రిమినల్‌కేసులు నమోదుచేయిస్తామని బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శుక్రవారం వరదనీరుమళ్లింపు పనుల జాప్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో వరదనీరు బయటకు వెళ్లకుండా దుకాణాల్లోకి ఎందుకు వస్తున్నదనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడ కూడా వరదనీరు నిల్వకుండా చూస్తున్నామని, ఎవరి దుకాణాలు, ఇండ్లకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా కల్పించారు. దీనిపై రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. పందిల్ల వద్ద బ్రిడ్జినిర్మాణం వేగవంతం చేయాలని, లేనిపక్షంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతాయనే విషయాన్ని స్పష్టం చేసినట్లు మంత్రి తెలిపారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సదరు కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమదు చేయించేందుకు వెనుకాడే ప్రసక్తేలేదని ఆయన హెచ్చరించారు. లోతట్టుప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూడాలని, పలు గ్రామపంచాయతీల పరిధిలోని జాతీయరహదారులపై ఉన్న సెంట్రల్‌లైటింగ్‌పై ఉన్న విద్యుత్‌దీపాలు వెలిగించేందుకు అనుమతులు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామమూర్తి, జిల్లాగ్రంథాలయ సంస్థచైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మల్లెచెట్టుచౌరస్తాలో మురుగు కాల్వలో నిలిచిన వరదనీటిని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్